

నేను ఎప్పటికీ తిరిగిరాలేను



వాళ్ళ నాన్న తనకిచ్చెళ్ళిపోయిన ఆ నావఅంటే పంచప్రాణాలు గంగరాజుకి. ఆర్నెల్లకోసారి దాన్ని నీళ్ళలోంచి బయటికి తీసి రిపేర్లుంటే చేయించి నావకిందున్న పచ్చటినాచు గోకి చెక్కకీచెక్కకీ మధ్య పెరిగిన సందుల్లో కొబ్బరిపీచు, కిలుం (నల్లగా ఉండే లక్కలాంటిది) పెట్టించాకగానీ జట్టీలోకి వదల్డు. పొద్దుటే రేవులోకి దిగి తల్లిగోదారికి దణ్ణవెట్టుకున్నాకాగానీ గెడెయ్యడు. అలాగ చాన్నాళ్ళనించి జరుగుతా వస్తంది.

రోజులు మారుతున్నాయి నలుగురిలాగ నావకి ఇంజను బిగించాల్సిన పని బడింది గంగరాజుకి. బేంకువాళ్ళు లోను ఇవ్వడంతో ఆ ఇంజనూ బిగించే పని చాలా సులువై పోయింది. అదయ్యేకా తన ఇంజను నావని గొప్ప స్టీమరు అనేసుకుని సంబరపడిపోతున్న గంగరాజుకి దాని మీద మమకారం మరింత పెరిగిపోయింది.

శివరాత్రొచ్చింది.

గోదాట్లోస్నానం చేసి కోటిపిల్లేశ్వరుడ్ని దర్శనం చేసుకుందారని, కోటి దీపాలు చూద్దారని అద్దరినించీ ఇంకా ఏటిగట్టుకి ఆ పక్కనున్న మసకపిల్లి, బ్రహ్మపురి కొత్తకొంపలూ లాంటి గ్రామాలూ, ఈ పక్కనున్న కూళ్ళ, వాకతిప్ప, కపిలేశ్వరపురంలాంటి వూళ్ళనించి పాలోమంటా సవ్వారీబళ్ళమీంచి దిగిపోతున్నారు జనం, రకరకాల కొట్లు పెట్టేసేరు. పెట్రోమాక్సులైట్లూ, కిర్సనాలు బుడ్లూ వెలిగించేరు. ఊరు ఊరంతా ఒకటే సందడి. గోదాట్లోంచి గాలి ఎంత ముమ్మరంగా వీస్తున్నా కిక్కిరిసిపోయి ఒకళ్ళనొకళ్ళతో తోసుకుంటున్న జనం వల్ల ఒకటే ఉక్కపోతగా ఉంది.

దేవుడికి అర్తలం అరిటిపళ్ళు అగరత్తులూ ఇచ్చొద్దావని గుళ్ళోకెళ్తుంటే మెరుస్తా కనిపించిందో ఆడమనిషి. కోటిపిల్లిగాదు ఆ మనిషిది. నల్లగా నాజూగ్గా ఉంది. దీపావళినాడు జలజలా ముత్యాలు రాల్చే మాతాబాలాగుంది. పెద్ద పెద్ద కళ్ళు. ముక్కుపొడుం రంగు ఉప్పాడ చీర, పొడుగాటి జడపాయల చివర్లో మూడు జడగంటలు కాళ్ళకి మువ్వలపట్టాలు. అరికాళ్లకీ అరిచేతులకీ గోరింటాకు. అందానికి మించి ద్వారపూడి దూళ్ళ సంతలో గిత్తలాగ చాలా పొగరు బోత్తనం ఉందా ఆడమనిషిలో.

ఆ మనిషెనకాల బడ్డాడు పట్టాలగంగరాజు.

ఆ మనిషి ఎక్కడ తిరుగుతుంటే అక్కడ తిరగడం మొదలెట్టేడు. దూరాల్నించి ఎడ్లబళ్ళలో తీర్థానికొచ్చిన జనం చెట్ల కింద కట్టేసిన బళ్ళకిందే వండుకుతింటున్నారు. గుడి గోపురానికి కట్టిన లౌడు స్పీకర్లలోంచి భజన్లు ముమ్మరంగా వినిపిస్తున్నాయి. జీళ్ళ దుకాణం

దగ్గర మనిషికి కునుకుపాట్లు ఎక్కువయ్యినియ్యి. అవతలొడ్డు నించొచ్చిన ఆడపిల్లల్ని ఇవతలొడ్డు మగకుర్రోళ్ళు సైతిగా లాక్కుని రేవు ఒడ్డున చీకట్లోకి పోతున్నారు. రేవులో రావిచెట్టు నాన్చిఉన్న అబ్బు కాఫీ హొటేలప్పుడే తెరిచేసేడు. ఇంకోగంటలో తెల్లారేలాగుంది. కోటిపిల్లినించి రాజమండ్రి వెళ్ళేబస్సులోకెళ్ళి ఆమనిషి కూచుంటే రాజమండ్రి దాకా టిక్కెట్టు కొనేసుకుని ఆ మనిషి కూర్చున్న సీటుకి వెనకాల సీట్లోకెళ్ళి కూచున్నాడు గంగరాజు.

బస్సు పసలపూడి కాలవ గట్టు మీదాగిన వెంటనే లేచి దిగిపోయిందా పిల్ల. తనుకూడా దిగేడు. ఊళ్ళో సుబ్బారాయుడుగుడి దగ్గర ఎదురైన అరిటిపళ్ళ పట్టాన్ని అడిగితే చెప్పేడు ఆ పిల్లపేరు సూరేకాంతవట. వాళ్ళనాన్న కొండానారాయుడు కోర్రాములుగారి బస్సుమీద డ్రైవరట వాళ్ళిల్లు చింతాలమ్మ గుళ్ళో చంపేసిన పుల్లారెడ్డి ఇంటి పక్కనంట.

తిరుగుబస్సులో కోటిపిల్లి వెళ్ళిపోయిన గంగరాజు వాళ్ళూరు పెద్దల్ని పసలపూడి పంపించేడు.

"జాతరలో ఆ కుర్రోడ్ని నేనూ చూసేను. నాకు నచ్చేడు. అయితే, పెళ్లయ్యేక నేను కోటిపిల్లి మట్టుకి కాపురానికెళ్లను తన్నే పసలపూడి రమ్మనండి. అలాగిష్టవయితేనే పెళ్ళి" అనేసి కరాకండీగా చెప్పేసింది సూరేకాంతం.

ఒకవారం పాటు బాగా ఆలోచించుకున్న పట్టాలగంగరాజు "అలాగే" అన్నాడు.

సూరేకాంతం అమ్మ కొండా శేషమ్మ పెట్టిన కండిషన్ మీద వాళ్ళ పెళ్ళి సోమేశ్వరం గుళ్ళో అయ్యింది.

* * *

ఆవేళ శోభనం.

రాత్రి గదిలోకెళ్ళేక తెల్సింది గంగరాజుకి. అందమైన ఆ సూరేకాంతానికి యమాగీర, మహానిక్కు. తను చెప్పేదాకా జబ్బమీద చెయ్యేయ్యకూడదు. తను చెప్పేదాకా బుగ్గ కొరక్కూడదు. తను "ఊ" అనేదాకా మూతిమీద ముద్దెట్టకూడదు. అన్నింటికంటే, అందరూ వినాల్సిన ముఖ్య విషయమేంటంటే

తన మొగుడు తనని తప్ప ఈ భూప్రెపంచకంలో ఇంకెవర్ని ప్రేమించకూడదు. ఇంకో ఆడమనిషి కేసి కన్నెత్తి చూడకూడదు. ఆఖరికి...తన నీడనికూడా.

బాగా అర్థం చేసుకున్న గంగరాజు కొంచెం నిబాళించుకుని కాస్తంత తమాయించుకుని అనుకున్నాడు తను ఏవన్నా మాటాడ్నీ నాకు రెండుకళ్ళు ఒకటి నా భార్య సూరేకాంతం రెండు మా నాన్నిచ్చిన నావ అని.

* * *

ప్రతీరోజు కోటిపిల్లిలో తన నావ పనయిపోయేకా దాన్ని ఒడ్డున కట్టేసి సూర్యచంద్రా ట్రాన్సుపోర్టు వాళ్ల లాస్టు బస్సట్టుకుని పసలపూడి వచ్చే గంగరాజుకి ఒకోసారి గోదారిఒడ్డున ఇసకరేంపుల్లో పనున్నప్పుడు పసలపూడిరావడం కుదిరేది కాదు. అప్పుడు సూరేకాంతం మొకం చూడకండా ఉండలేకపోయేవాడు. నా నావలో నా పనీ చేసుకోవాలి. నా భార్యనీ చూసుకోవాలంటే ఎలాగ? అసలెలాగ అని ఆలోచించించుకుంటున్న గంగరాజు చెక్కతో ఈ ప్రపంచంలో ఏదైనా చెక్కగల జక్కం వీరన్న దగ్గరకెళ్ళి రామచంద్రపురం మూర్తీ స్టూడియోలో తీయించుకున్న పెళ్ళి ఫొటో చూపెట్టి ఆజంటలో తన సూరేకాంతం ముఖాన్ని గోటితో గీసి మరీ చూపెట్టి "తన తల చెక్కాలి. ఆ మూర్తి తీసిన ఫొటో అచ్చు గుద్ది నట్టుండాలి" అన్నాడు. గొప్ప దారు శిల్పి జక్కం వీరన్న మారేడుమిల్లి అడివిలో దొరికే చిక్కుడు చెక్కతో అచ్చం సూరేకాంతం ముఖాన్ని చెక్కి ఇచ్చేసేడు.

దాన్ని తీసుకెళ్ళి తన నావముందు వాసంమేకు లేసి దిగ్గొట్టేడు పట్టాల గంగరాజు.

ఇక అక్కడ్నించి పసలపూడి వెళ్ళలేని పరిస్థితి వచ్చినప్పుడు ఆ చెక్క ముఖంలోనే తన అందాల సూరేకాంతాన్ని చూసుకునేవాడు. ఆ బొమ్మగాలికి ఊగుతుంటే తన సూరేకాంతం సరాసరి తన ముందుకొచ్చినట్టు ఇదయిపోతా వుండేవాడు. అప్పుడప్పుడూ ఆ బొమ్మతోనే ఊసులాడతా అలుగుతా ఆరాలు తీస్తా ఉండేవాడు.

* * *

ఆవేళ తూరుపు తెల్లవారి ఎర్రవారక ముందే రేవులో రావిచెట్టు పక్కనున్న అబ్బు ఒట్టేల్లో ఉల్లిపాయా అల్లం ముక్కల నేతి పెసరట్టు తింటున్న గంగరాజు తన పక్కన ఆబగా చూస్తున్న పండు ముసలి సాధువుగారి ముఖం చూసేడు. ఏంటో ఎప్పుడూలేంది ఆ మహానుభావుడిముఖంలో భగవంతుడు కనిపించేసరికి లేచి వారికి దణ్ణమెట్టుకుని అబ్బు దగ్గరకెళ్ళి ''ఈరికి తిన్నన్ని నేతి పెసరట్లూ, గోదుం ఉప్మాపెట్టి నురగేసి లిప్టన్ స్ట్రాంగ్ టీ ఇయ్యి'' అన్నాడు.

అన్నీ తిని, తన నావ ఎక్కి అద్దరి చేరబోతున్న సాధువు దగ్గర అర్ధణా బిళ్ళకూడా పుచ్చుకోలేదు గంగరాజు.

దానికి చాలా ఇదయిపోయిన సాధువుగారు తన మెడలో ఉన్న రుద్రాక్షమాలని బయటికి తీస్తూ ''నాయినా ఇది రెండువందల పుణ్యక్షేత్రాలు దర్శించిన రుద్రాక్షమాల దీన్ని నీ మెళ్ళో వేసుకో...''అని తన మొలలోకి దోపిన గుడ్డ సంచిలోంచి రెండు నీలం రంగు రాళ్ళని బయటికి తీసి ''ఇవి మామూలు రాళ్ళు కాదు నాయినా... చాలా గొప్ప రాళ్ళు...వీటిని చాలా పవిత్రంగా చూసుకో తేడా వస్తే చాలా ప్రమాదం తండ్రీ..''అని కొంచెం ఆగి ''ఈ ప్రపంచంలో నీకు చాలా ఇష్టమైనవేంటి?'' అన్నాడు.

''నా భార్య కళ్ళు'' అన్నాడు గంగరాజు.

''ఈరాళ్ళు నీ భార్య కళ్ళులాగే చూసుకోగలవా?'' అడిగేడు సాధువు.

''చూసుకుంటానండీ'' అన్నాడు గంగరాజు.

ముక్తేశ్వరం రేవులోకొచ్చిన సాధువు నవ్వుతా గంగరాజుని ఆశీర్వదిస్తా ''శుభం'' అని ఆరెండు నీలం రాళ్ళూ అందించేసి దిగెళ్ళిపోయేడు.

వెంటనే ఆరాళ్ళని నావ ముందు బిగించిన తన భార్య బొమ్మకళ్ళున్నచోటులో లక్కతో అతికించి పెట్టిన గంగరాజు మర్నాటినించీ ఆ కళ్ళనే తన ప్రాణంలో ప్రాణమయిన ''సూరేకాంతం కళ్ళు'' అనుకుంటా చూస్తున్నాడు.

ఆవేళ కోటిపల్లి రేవులోంచి తాళ్ళపొలం (అదో ఊరు) ఇటుకలోడు వేసుకుని యానాంకి ముందొచ్చే పిల్లంకరేవులో కొచ్చిన గంగరాజు బాగా అలిసిపోయేడు. రాత్రయిపోయింది. గోదావరి ఒడ్డుకొచ్చి భార్యముఖం ముందుకూర్చుని నీలం రాళ్ళు పొదిగిన కళ్ళనే ఆకళ్ళనే చూస్తా తెగ మాటాడ్డం మొదలెట్టేడు. అలా మాటాడి మాటాడి ఎప్పటికో పడుకున్న గంగరాజు తెలతెల వారేముందు ఇంజను స్టార్ట్ చేసి కోటిపిల్లి వేపు బయల్దేరేడు.

ఇక పసలపూడి వేపు రాలేకపోడంతో పెళ్ళాం మీద మనేద పెరిగిపోడంతో ఆ చెక్కతల ముందే కూర్చుని మాటాడుకోడం ఎక్కువైంది గంగరాజుకి.

కొన్నాళ్ళు గడిచినియ్యి.

పసలపూడిలో ఉన్న సూరేకాంతానికి అనుమానమొచ్చి పొద్దోయేకా తన పెనిమిటి వచ్చే సూర్య చంద్రావాళ్ళ పసుపురంగు బస్సెక్కి

కోటిపిల్లి వచ్చేసి "ఏంటిది బొత్తిగా నల్లపూసయి పోయేవు అద్దరిలో దేన్నన్నా మరిగేవా" అని తిడ్తుంటే నవ్వుతున్నాడు గంగరాజు.

"ఏంటి...అసలు మాటాడవేంటి అంతదూరంనించి ఇది అడగడానికే వొచ్చేను..చెప్పు... ఇదిగో నిన్నే" అంటా గంగరాజు తొడుక్కున్న చిన్నిగళ్ళ బిన్నీచొక్కాని చింపేసింది.

అంతా వినేసి అన్ని భరించిన గంగరాజు ఇక చెప్పకపోతే చంపేసేలాగుందీ మనిషి అనుకున్నాక చెప్పేడు.

జక్కం వీరన్న చెక్కి ఇచ్చిన తన చెక్క తలగురించీ, సాధుగారిస్తే బొమ్మకళ్ళకి పొదిగిన ఆ రెండు నీలం రాళ్ళగురించీ, ఆటి గొప్పదనం గురించీ ఆటిని బొమ్మ కళ్ళకి పెట్టేకా వాటితో మాటాడుకోడం గురించి తెగ జెప్పేడు. వినేవాడికి చిరాకొచ్చేంత సేపు చెప్పేడు.

అదంతా విన్న సూరేకాంతం "అయ్యేంటో చాలా గొప్పరాళ్ళలాగున్నాయి" అంది.

"చాలా గొప్పరాళ్ళు కాంతం. ఆ ఇచ్చినోడు సాధువు కాదు. కోటిపిల్లేశ్వరుడే అని అనుమానం" అన్నాడు.

"అయితే దేవుడిచ్చిన ఆ నీలం రాళ్ళు నాక్కావాలి" అంది సూరేకాంతం.

"ఒద్దొలేకాంతం ఆటిని అక్కడే ఉండనియ్యి" అన్నాడు.

కాదూ గూడదంది.

"నన్నిబ్బంది పెట్టకే" అన్నాడు.

పెద్దగొడవే అయ్యింది చివరికి. ఇవ్వడానికి ఒప్పుకోడం లేదు గంగరాజు.

ఆ రాత్రి చాలాసేపు ఆలోచించిన సూరేకాంతం అసలులోతులు ఆలోచించడం చేతగాని సూరేకాంతం "నూరు ఆరైనా సరే ఆ సాధువిచ్చిన ఆ నీలం రాళ్ళన్ని దొబ్బెయ్యాలి" అనేసుకుని ఒకవారం పాటు అత్తోరింట్లో ఉండిపోయిన సూరేకాంతం. ఒకరాత్రిపూట రేవులో కొచ్చి నావ ముందున్నతన తలని చూసింది. తన కళ్ళల్లో అతికించిన నీలం రాళ్ళని చూసింది.

గోదారిగాలి చల్లగా వీస్తుంది. దూరంగా గోదారి మధ్యలో చేపలకోసం వేసిన వలల మీద ఎండిపోయిన ఆనబకాయడొప్పల్లో వెలిగించిన ఇలాయిబుడ్లు నేలమీదికి దిగిన నక్షత్రాల్లాగ మెరుస్తున్నాయి. ఒడ్డున కట్టేసున్న లాంచీ టాపెక్కిన సరంగు చల్లగాలికి నిద్రోతున్నాడు. ఒడ్డును తాకుతున్న గోదాట్లోనీళ్ళు తపతపామని చప్పుళ్ళు చేస్తున్నాయి. కూడా పట్టుకెళ్ళిన అట్లకాడతో చెక్కతల కళ్ళకున్న ఆ రాళ్ళని పెకిలించి మరీ లాగేసికూడా పట్టుకొచ్చిన శిలుకుగుడ్డలో వాటిని మూటగట్టుకుని రేవులో దొరికిన రెండు గులకరాళ్ళని బొమ్మ కళ్ళకి పెట్టేసి ఆ రాత్రి లాస్టు బస్సుకే పసలపూడి వచ్చేసింది సూరేకాంతం.

మర్నాడు పొద్దుటే ఫస్టు బస్సెక్కి మండపేటలో ఉండే అర్తమూరు సత్యంగారి దగ్గరకెళ్ళి ఆ నీలం రాళ్లని చూపించి "ఈటితో నా చెవులకీ దుద్దులు చేసి పెట్టండి బ్రెమ్మంగారూ" అని బంగారం మజూరూ ఇచ్చింది.

వారంరోజుల్లో దుద్దులుచేసిచ్చేడు అర్తమూరు సత్యం. వాటిని చెవులకి పెట్టుకుంటే అవి రేవు ఒడ్డున కట్టేసిన వేటనావ అలలకి కదుల్తున్నట్టు అటూ ఇటూ ఊగుతా ఆ నీలంరంగు రాళ్ళలో విచిత్రమైన కాంతి చెంపలమీద తన పెద్ద పెద్ద కనుగుడ్లమీదా పడ్తుంది.

తన ఇంజను పడవలో మాచవరం ఇటికలోడు వేసుకుని యానం రేవులోకెళ్ళిన గంగరాజు యానాంలో చవగ్గాదొరికే బ్రాందీకాయల కేసుల్నేసుకుని మడ అడవుల మీంచి చొల్లంగిసైడు వెళ్ళాల్సిన బేరం కుదిరింది. ఆవేళ తుఫాను రాడంతో నావ దారి తప్పి కాకినాడ సముద్రంలో కెళ్ళిపోయేడు. ఇంజనులో ఆయిలయిపోయింది. గెడతీసేడు సముద్రంలో పెద్ద పెద్ద కెరటాల మధ్య ఇరుక్కుపోయిన

పట్టాల గంగరాజు నావ గాలి ఎటు వీస్తే ఆ పక్కకి పోతుంది. అలాగలాగ ఎక్కడికో పోతుంది.

* * *

రోజులు గడుస్తున్నాయి.

దుద్దుల్లో నీలంరంగురాళ్ళ కాంతి కనుగుడ్ల మీదా పడ్డంవల్లో లేకపోతే ఆరాళ్లలో మహత్యం వల్లో తెల్లుగానీ సూరేకాంతం అందమైన కళ్ళు చూపు తగ్గిపోతుంటే ఒకటే అదురూ భయం పట్టుకుంది. రాంపురం అక్కడ్నించి కాకినాడ వెళ్ళిన సూరేకాంతం డాక్టర్లకి చూపించుకుంటే ఈ కళ్ళ జబ్బుకి మందుల్లేవు. అసలు వైద్యశాస్త్రంలో ఇలాంటి జబ్బుని మేమెప్పుడూ చూసెరగం అన్నారు.

బెంగెట్టుకుంది సూరేకాంతం కళ్ళు తుఫానొచ్చిన రోజు మధ్యాన్నమే చీకటి పడిపోయి నట్టయిపోతున్నాయి. అగులు గుద్దుకుంటా ఏడుస్తున్న సూరేకాంతం ఆ మహిమగల రాళ్ళను పీకి చెవిదుద్దులు చేయించుకోడం వల్లే నాకీ కళ్ల జబ్బొచ్చింది. అనుకుంటా కోటిపిల్లి అత్తోరింటి కెళ్ళి అక్కడ్నించి గోదారిరేవులో కెళ్ళి గట్టుమీద కూర్చుని దూరప్రయాణమై ఎళ్ళిన తన పెనిమిటి ఇంజనునావ ఎప్పుడు రేవులో కొస్తదా ఎప్పుడు నీలంరాళ్ళని చెక్కబొమ్మ తలకి పెట్టేద్దారా అని చూస్తుంది.

వర్షాకాలం, శీతాకాలం, ఎండాకాలం ఒకదానెనకాల ఒకటి వచ్చి వెళ్తున్నాయి.

నీలంరాళ్లని గుప్పెట్లో పెట్టుకుని ఆ కోటిపిల్లిరేవు ఒడ్డునే కూర్చునుంది సూరేకాంతం.

కానీ,

మహా సముద్రంలో కల్సిపోయి ఏ పక్కకో వెళ్ళిపోయిన తన భర్త పట్టాల గంగరాజు ఇంజను నావ ఎప్పటికీ తిరిగి రాలేదు.

* * *